ప్రజాశక్తి
బుధవారం 17 ఏప్రిల్ 2024
8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

తాగునీటి తిప్పలు

- మరమ్మతులపై కొరవడిన ప్రభుత్వ శ్రద్ధ
- పొలం బోరు నీరు తెచ్చుకుంటున్న అచ్చెర్ల దళిత కాలనీ మహిళలు
- అరకొరగా జలజీవన్ మిషన్ పనులు
- అనకాపల్లి పట్టణంలోనూ నీటి అవస్థలు

మరమ్మతుకు గురైన గొర్లెవానిపాలెం రక్షిత మంచినీటి పథకం

వ్యవసాయ బోరు నుంచి నీరు తెచ్చుకుంటున్న అచ్చెర్ల దళితకాలనీ మహిళలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, కశింకోట, పరవాడ విలేకర్లు

జిల్లాలో తాగునీటి సమస్య ప్రారంభమైంది. మండల పరిషత్, పంచాయతీల 15వ ఆర్థిక సంఘం నిధులతో రక్షిత మంచినీటి పథకాలు, బోర్లు మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఆ శ్రద్ధ తీసుకోని చోట గ్రామస్తులు తాగునీటి అవస్థలు పడుతున్నారు. గతంలో బోర్లు, మంచినీటి పథకాల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేసేది. ఇప్పుడు 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించాలని ఆదేశించింది. రక్షిత మంచినీటి పథకాల పైపులు దెబ్బతిన్నచోట పునరుద్ధరించక పోవడంతో జిల్లాలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. దీనికితోడు వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భ జలాలు పడిపో తున్నాయి. దీంతో బోరు నీటి ధార తగ్గిపోతోంది. వర్షాలు పడకపోతే మే నాటికి తాగునీటి సమస్య తీవ్రం కానుంది. ఎన్నికల పనిలో నిమగ్నమైన అధికారులు తాగునీటి సమస్యపై దృష్టి పెట్టని పరిస్థితి వుంది. పరవాడ మండలం గొర్లెవాని పాలెం పంచాయతీలోని మిగతా 2లో..

శిరోముండనం కేసులో

తోట త్రిమూర్తులకు కఠిన శిక్ష విధించాలి

ప్రస్తుత శిక్ష దళితుల మనోధైర్యాన్ని పెంచేలా లేదు : సిపిఎం

ప్రజాశక్తి - అనకాపల్లి

శిరోముండనం కేసులో తోట త్రిమూర్తులకు కఠిన శిక్ష విధించాలని, ప్రస్తుతం విధించిన శిక్ష దళితుల మనోధైర్యాన్ని పెంచే విధంగా లేదని సిపిఎం పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ అనకాపల్లి, విశాఖ జిల్లాల కార్యదర్శులు కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు మంగళవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. 18 నెలలు జైలు శిక్ష, రూ.2.50 లక్షల జరిమానా విధించి అతి తక్కువ శిక్షతో సరిపెట్టే చర్యలను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. 28 సంవత్సరాల క్రితం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా జరిగిన అనాగరికమైన దాడిపై ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులోనే తీర్పు అత్యంత ఆలస్యంగా వచ్చిందన్నారు. దీనిని బట్టి పెత్తందారుల పలుకుబడి ఎంత వుందో ఇట్టే అర్థమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై అప్పీలుకు వెళ్లి ఇప్పటికైనా కఠిన శిక్ష ఖరారయ్యే విధంగా ప్రయత్నం చేయాలని కోరారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని దళితులపై జరిగే ఇలాంటి నీచమైన అకృత్యాలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. పోలీసు యంత్రాంగం కూడా నిర్లక్ష్య దోరణితో వ్యవహరించడం వల్లే ఇంత ఆలస్యం అయ్యిందని తెలిపారు. ఇలాంటి ఘటనల్లో ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరించి వుంటే ఇంత ఆలస్యం అయ్యిండేది కాదన్నారు. ఒక ప్రజా ప్రతినిధిగా వుండి ప్రజల పక్షాన వుండాల్సిన తోట త్రిమూర్తులు బాధ్యతారహితంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ కేసు నుండి బయటపడేందుకు అనేక పార్టీలు మారుతూ ఆయన వచ్చారన్నారు. బాధితులను బెదిరింపు చర్యలకు పూనుకున్న అనేక సంఘటనలు ఉన్నాయన్నారు. శిరోముండనం జరిగిన దళితులకు న్యాయం చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు జరిగితే ప్రభుత్వమే బాధ్యత తీసుకొని బాధితుల తరఫున నిలబడాలని తెలిపారు. లేనట్లయితే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

కేసును తప్పుదోవ పట్టించడానికి అనేక కుట్రలు : కెవిపిఎస్

శిరోముండనం కేసును తప్పుదోవ పట్టించడానికి అనేక కుట్రలు జరిగాయని కెవిపిఎస్ పేర్కొంది. సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సుబ్బన్న, ప్రధాన కార్యదర్శి తిరుకోటి చిరంజీవి, నాయకులు ఎంవి.ప్రసాద్, వై.రాజు మీడియాతో మాట్లాడుతూ 28 సంవత్సరాలుగా అన్నిచోట్లా కేసును తిప్పారన్నారు. కేసు నుంచి తప్పించుకోవడానికి తోట త్రిమూర్తులు రాష్ట్రంలో అధికారంలో ఏ పార్టీ వుంటే ఆ పార్టీలోకి మారుతూ టిడిపి, వైసిపి నాయకునిగా చలామణి అవుతూ వచ్చారన్నారు.

దువ్వాడ మీదుగా మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

వార్త 2లో..

4జి పరికరాల పంపిణీలో నిర్లక్ష్యంపై నిరసన

వార్త 2లో..

హాల్ టికెట్ ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం

వార్త 8లో..

పాలకుల నిర్లక్ష్యం వల్లే ఉత్తరాంధ్ర వెనుకబాటు

మాట్లాడుతున్న అజశర్మ

ప్రజాశక్తి - గాజువాక : పాలకుల నిర్లక్ష్యం వల్లే ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి గురైందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు.. ఉత్తరాంధ్ర మ్యానిఫెస్టో - 2024ను గాజువాకలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపారమైన వనరులున్న ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఉత్తరాంధ్ర అభివృద్ధి గురించి కాకుండా తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం పనిచేయడం అత్యంత విచారకరమన్నారు. ఈ ప్రాంతాన్ని పదేళ్లలో ఏమాత్రమూ అభివృద్ధి చేయకుండా పాలకులు అవకాశవాదం ప్రదర్శించారన్నారు. రాష్ట్ర విభజన చట్టం అమలు చేయలేదని తెలిపారు. దీనివల్ల ఈ పదేళ్ల కాలంలో ఉత్తరాంధ్ర మరింత వెనుకబాటులోకి నెట్టబడిందన్నారు. తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిర్ణయించడం అత్యంత దుర్మార్గమన్నారు. వివిధ ప్రాజెక్టుల పేరుతో ఉత్తరాంధ్రలో విస్తారంగా ఉన్న అటవీ భూములను కార్పొరేట్లకు ధారాదత్తం చేసి గిరిజనులను రోడ్లమీదకు నెట్టాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. సముద్రంతో సహా సహజ వనరులు అన్నింటినీ కార్పొరేట్‌పరం చేస్తున్నారన్నారు. రాష్ట్రం, ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడవలసిన తెలుగుదేశం, జనసేన పార్టీలు ఆ పని చేయకపోగా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బిజెపితో జతకట్టాయని తెలిపారు. విభజన చట్టాన్ని అమలు చేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపికి సహకరించేలా మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

తాగునీటి తిప్పలు

గొర్లెవానిపాలెం బిసి కాలనీలో పది రోజులుగా తాగునీటి సమస్యతో ప్రజలు బాధపడుతున్నారు. పైప్‌లైన్ లీక్ కావడంతో ఈ సమస్య ఏర్పడింది. పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టేవరకు ప్రత్యామ్నాయ చర్యలు పంచాయతీ చేపట్టలేదు. మరమ్మతు బాధ్యత మండల పరిషత్, పంచాయతీలదేనని గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులు పట్టించుకోవడం మానేశారు. మంగళవారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే అదీప్‌రాజు ట్యాంకర్ నీటిని తెప్పించారు తప్పితే మరమ్మతుల విషయం పట్టించుకోలేదు.

జిల్లాలోని మండలాలు : 24
పంచాయతీలు : 646
జనాభా : 15.85 లక్షలు
చేతి బోర్లు : 15,784
పిడబ్ల్యుఎస్ స్కీంలు : 1842
సిపిడబ్ల్యుఎస్ స్కీంలు : 28

కశింకోట మండలంలోని అచ్చెర్లలో తాగునీటి కుళాయి పాడవడంతో దళితకాలనీ మహిళలు సమీపంలోని వ్యవసాయ బోరు నుంచి బిందెలతో నీరు తెచ్చుకుంటున్నారు. ఆరు రోజుల నుంచి నీరురాకపోయినా అధికారులెవరూ పట్టించుకోవడంలేదు. చివరకు వ్యవసాయ బోరునీరు దళితకాలనీ వాసులకు దిక్కయింది. మరమ్మతులు చేపట్టక అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం సెజ్ నిర్వాసితులు తాగునీటి ఇబ్బందులుపడుతున్నారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలోని జివిఎంసి పరిధిలో శారద కాలనీ, విజయరామరాజుపేట, గవరపాలెం ప్రాంతాల్లో తాగునీటి సమస్య వుంది. మినీ తాగునీటి పథకాల మరమ్మతులు జివిఎంసి చేపట్టకపోవడంతో తాగునీటి సమస్యలను పట్టణవాసులు ఎదుర్కొంటున్నారు.

జలజీవన్ మిషన్ కింద ఇంటింటికి కుళాయి నీరు సరఫరా చేయాలన్న లక్ష్యానికి తగినట్లు పనులు జరగకపోవడంతో నీటి సమస్య తప్పడంలేదు. జిల్లాలో జలజీవన్ మిషన్ కింద వివిధ సందర్భాల్లో రూ.720.73 కోట్లతో 2,163 పనులు మంజూరయ్యాయి. వీటిలో ఇంతవరకు రూ.211.47 కోట్లు ఖర్చుచేసి 673 పనులు పూర్తిచేశారు. 688 పనులు వివిధ దశల్లో వున్నాయి. ఇంకా 802 పనులు ప్రారంభించలేదు. రూ.32 కోట్లతో జివిఎంసిలోని విలీన గ్రామాలకు అగనంపూడి నుంచి అనకాపల్లికి తాగునీరు అందించడానికి పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపనచేసి నాలుగున్నర సంవత్సరాలవుతున్నా ఈ నాటికీ పూర్తికాలేదు. తాగునీటి పథకాలు సకాలంలో పూర్తిచేయకపోవడం, మరమ్మతులు చేపట్టకపోవడంతో తాగునీటి సమస్యతో జనం బాధపడాల్సివస్తోంది.

పాలకుల నిర్లక్ష్యం వల్లే ఉత్తరాంధ్ర వెనుకబాటు

రాష్ట్ర వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. అందువల్ల రాష్ట్రంలోని ఈ మూడు ప్రధాన పార్టీల అవకాశవాదాన్ని ఎండగట్టి ప్రత్యామ్నాయం వైపు ప్రజలు ఆలోచించాలని, రాష్ట్రం, ఉత్తరాంధ్ర అభివృద్ధి, స్టీల్‌ప్లాంట్ రక్షణకై నిలవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నీటి ప్రాజెక్టుల నిర్మాణం, స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిలిపివేత, ప్రభుత్వ రంగ బలోపేతం, పర్యావరణ పరిరక్షణ,. గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం పటిష్ట అమలు, జిఒ నెంబర్ 3కి చట్టబద్ధత, ప్రభుత్వ విద్య, వైద్యం పటిష్టత, మౌలిక వసతుల కల్పన, రాష్ట్ర విభజన చట్టం అమలు, ప్రత్యేక హోదా అంశాలపై సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి వైఖరి తెలపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిఎన్.వర్మ, వైటి.దాసు, ఎన్.రామారావు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉక్కు కార్మిక సంఘాల నాయకులు

స్టీల్‌ప్లాంట్‌పై దృష్టిపెట్టండి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను బలహీన పరిచి కార్మికులకు, ఈ ప్రాంత ప్రజలకు నష్టం చేయాలని స్టీల్ యాజమాన్యం చూస్తోందని, తక్షణమే జోక్యం చేసుకోవాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక నేతలు మంగళవారం రాత్రి కలెక్టర్‌ను కలిశారు.. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున తాను పూర్తి స్థాయిలో ఏమీ చేయలేని స్థితి వుందని తెలిపారు. ప్లాంట్‌కు నష్టం జరగకుండా తగు చర్యలకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు..

సానుభూతితో ఓట్లు కొట్టేసేందుకు జగన్ డ్రామా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సానుభూతితో ఓట్లు కొట్టేసేందుకు వైసిపి అధినేత జగన్ రాయి దాడి డ్రామాకు తెరతీశారని తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టాభిరాం అన్నారు. మంగళవారం జిల్లా టిడిపి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు కోడికత్తి 2.0ను చూస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి డిపాజిట్లు కూడా రావని తెలిపారు. సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ప్రణవ్ గోపాల్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని ఎంవిపి కాలనీ సెక్టర్ 9 అప్పుఘర్ ప్రాంతంలో కూటమి తరపున పోటీ చేస్తున్న విశాఖ తూర్పు టిడిపి అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ మంగళవారం విస్తృత ప్రచారం చేశారు.

4జి పరికరాల పంపిణీలో నిర్లక్ష్యంపై నిరసన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : 4జి పరికరాల సరఫరాలో నిర్లక్ష్యంపై మంగళవారం భోజన విరామ సమయంలో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పిఇ సిహెచ్‌వి సాగర్ మాట్లాడుతూ, తయారీలో సమస్యలతో టిసిఎస్ సంస్థ నుంచి ఎంతోకాలంగా 4జి పరికరాలు సరఫరా కావడం లేదన్నారు. ఈసాంకేతిక సమస్య అధిగమించడానికి నోకియా, జెడ్‌టిఇ వంటి సంస్థలను టిసిఎస్ సాయం కోరినట్లు వార్తలు వచ్చాయన్నారు. నెట్‌వర్క్ సమస్యతో ఇటీవల పది లక్షల మంది వినియోగదారులు బిఎస్ఎన్ఎల్‌ను విడిచిపెట్టారని, మరింత మంది వీడిపోయే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులకు 4జి సేవలు అందించేందుకు తాత్కాలిక ఏర్పాటుగా వోడాఫోన్ ఐడియా నెట్‌వర్క్ వినియోగానికి బిఎస్ఎన్ఎల్‌కు అనుమతించాలని డిమాండ్ చేశారు. దీనిపై బిఎస్ఎన్ఎల్ స్పందించడం లేదని, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి జాన్ వర్గీస్ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

దువ్వాడ మీదుగా మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవిలో ప్రయాణీకుల అదనపు రద్దీని దృష్టిలో పెట్టుకుని, ఎస్ఎంవి బెంగళూరు, మాల్దా టౌన్ , సికింద్రాబాద్- సంత్రాగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే నిర్ణయించింది. 06565 ఎస్ఎంవి బెంగళూరు-మాల్దా టౌన్ ప్రత్యేక రైలు ఈనెల 17 నుండి జూన్ 26 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 16.35 గంటలకు ఎస్ఎంవి బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.56 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. మరల 9.58 గంటలకు బయలుదేరి మరుసటి శుక్రవారం రోజు ఉదయం 7: 30 గంటలకు మాల్దా టౌన్ చేరుకుంటుంది. 06566 మాల్దా టౌన్, ఎస్ఎంవి బెంగళూరు ప్రత్యేక రైలు ఈనెల 20 నుండి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 8.50 గంటలకు మాల్దా టౌన్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 5.40 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 5.42 గంటలకు బయలుదేరి మూడవ రోజున సోమవారం తెల్లవారుజామున 3.00 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్ల మీదుగా ప్రయాణిస్తాయి. అలాగే 07221 సికింద్రాబాద్ - సంత్రాగచ్చి సమ్మర్ స్పెషల్ రైలు ఈనెల 20 నుండి జూన్ 29 వరకు ప్రతి మంగళ, శనివారాల్లో ఉదయం 6.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, అదేరోజు రాత్రి 19:55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది మరల 19:57 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10:25 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 07222 సంత్రాగచ్చి - విశాఖపట్నం వేసవి ప్రత్యేక రైలు ఈనెల 21 నుండి జూన్ 30 వరకు ప్రతి బుధ, ఆదివారాల్లో మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రాగచ్చి నుండి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3.20 గంటలకు దువ్వాడ చేరుకొని, మరల 3.22 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 15.00 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, బలాజ్‌పూర్ రోడ్, భువనేశ్వర్, కటౌట్ ఖరగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తాయి.

'దక్షిణం'లో వంశీకృష్ణ వద్దు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖ దక్షిణ నియోజకవర్గంలో జనసేన విజయం సాధించాలంటే, వంశీకృష్ణ శ్రీనివాస్‌ను తప్పించి నియోజకవర్గంలోని జనసేన నాయకులలో ఎవరో ఒకరికి టికెట్ ఇవ్వాలని 39వ వార్డు జనసేన కార్పొరేటర్ మహమ్మద్ సాదిక్, పార్టీ మత్స్యకార సంఘం నాయకుడు డాక్టర్ మూగి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు బహిరంగ లేఖ విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, దక్షిణ నియోజక వర్గ అభ్యర్థి మార్పు అవసరాన్ని కొన్నాళ్లక్రితమే చెప్పామని, అయితే అధినేత పవన్‌ను మోసపుచ్చి వంశీకృష్ణ టిక్కెట్ సాధించారని ఆరోపించారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా డ్రామా ఆడారన్నారు. అన్ని సర్వేలు వంశీ వ్యతిరేకంగా ఉన్న నేపథ్యంలో స్థానికుడైన మంచి అభ్యర్థికి జనసేన టికెట్ ఇస్తే విజయం ఖాయమన్నారు ప్రత్యర్థులు ప్రచారంలో దూసుకు పోతుంటే, వంశీకృష్ణ వెనకబడ్డారన్నారు ఇంకా వైసిపిలోనే కొనసాగుతూ, ఒక్కరోజైనా జనసేన జెండా మోయని వ్యక్తికి పార్టీ కేడర్ ఎలా ఓట్లేస్తారని ప్రశ్నించారు.

ఆకట్టుకున్న రైల్వే ఆర్ట్ గ్యాలరీ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతీయ రైల్వేలు ప్రారంభమై 171వసంతాలు సందర్భంగా, భారతీయ రైల్వే చారిత్రాత్మక ప్రయాణం, అభివృద్ధిని ప్రతిబింబించేలా వాల్తేర్ డివిజన్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే డిఆర్ఎం కార్యాలయంలో ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్, ఒడిశా ఛత్తీస్‌గఢ్‌లోని విభిన్న సాంస్కృతిక వారసత్వాన్ని హైలైట్ చేస్తూ ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని వాల్తేర్ డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ పలువురితో కలిసి ప్రారంభించారు.

కళాభారతిలో ముగిసిన నాటకోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మద్దిలపాలెం కళాభారతిలో నిర్వహిస్తున్న పైడా కౌశిక్ స్మారక నాటకోత్సవాలు మంగళవారం సాయంత్రం ముగిసాయి. ముగింపు కార్యక్రమాల కళాభారతి ప్రధాన కార్యదర్శి డాక్టర్. గుమ్ములూరి రాంబాబు, పైడా కృష్ణప్రసాద్, సిఎంఆర్ అధినేత మావూరి వెంకట రమణ, మిత్రో, డాక్టర్ కెజి వేణు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. చివరి రోజున అభినయ ఆర్ట్స్ గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం' నాటికను ప్రదర్శించారు. అనంతరం సభలో సిఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలలో భాగస్వాములవడం ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ కళాభారతి వ్యవస్థాపక కార్యదర్శి సుసర్ల గోపాలశాస్త్రి శత జయంతి సందర్భంగా శాస్త్రి చిత్రపటాన్ని ఉంచి, ఈ ఏడాది నిర్వహించే అన్ని కార్యక్రమాలను ఆయనకు అంకితమివ్వడంపై హర్షం వెలిబుచ్చారు. వివిధ రంగాల్లోని కళాకారుల ప్రదర్శనలను కళాభారతిలో నిర్వహించడం ద్వారా వారిని నగరవాసులకు పరిచయం చేయడంతోపాటు ప్రతిభ చూపిన వారికి ఉత్తమ బహుమతులిస్తున్నామన్నారు.

వైసిపి రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పెందుర్తి నియోజకవర్గంలో వైసిపి రెబల్‌గా పోటీ చేస్తానని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, విశాఖ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఎపి గిడ్డంగుల శాఖ మాజీ డైరెక్టర్ గుంటూరు వెంకట నరసింహారావు తెలిపారు. ఈ నెల 19న నామినేషన్ దాఖలు చేయనున్నట్లు వెల్లడించారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

IN THE HONOURABLE COURT OF THE IIND ADDL SENIOR CIVIL JUDGE (SENIOR DIVISION) AT VISAKHAPATNAM
I.P. 25/24

Between
1) Perla Jagadish S/o Late Surya Rao, D.No.19-21-40A, Rangireeju Veedhi Poorna Market Visakhapatnam.
2) Perla Sunitha W/o Jagadish D.No.19-21-40A, Rangireeju Veedhi, Poorna Market, Visakhapatnam.
...Petitioners

And
1) Alajangi China Raju S/o. Madhusudanrao D.No.13-340, Indira Nagar, Gopalapatnam, VSP
2) Kattamuri Harinarayana S/o Suryanarayana Rao D.No.14-3-3, Relliveedhi, Visakhapatnam
3) Kundrapu Venkata Rao S/o Narasinga Rao D.No.26-14-213, Poorna Market, Velampeta, VSP
4) N.Babi S/o Parameswararao, Shop No.B-47, Siva Sai Kirana, Poorna Market, Visakhapatnam.
5) K.Appala Raju @ B.Appala Raju S/o Sanyasi Rao D.No.27-13-9/B, Opp Barax Water Tank, Visakhapatnam.
6) Yellapu Raju S/o Swamy Naidu D.No.26-14-194, Poorna Market, VSP
7) K.Raju S/o Appala Swamy D.No.60/61 Flat No. TF6, Poorna Market, Visakhapatnam.
8) Ch.Narayana Reddy S/o Krishna Reddy D.No.26-14-229, Poorna Market, Visakhapatnam.
9) S.Simhachalam S/o Appanna D.No.26-4-62, Velampeta, VSP
10) Badireddi Kiran S/o Satyanarayana D.No.19-21-40, Rangireeju Veedhi, Visakhapatnam.
. . . Respondents

GENERAL NOTICE
The Public is hereby informed that the above Petitioners filed the above IP.25/24 on the file of the IInd Addl. Senior Civil Judge, Visakhapatnam and the matter stands Posted to **25-4-2024** for Hearing. So Public are hereby informed that any objections can be raised in the above case before the Hon'ble Court on **25-4-2024** either in Person or through on advocate **at 10:30 A.M.**
(By Court Order)
B.CHANDRA SEKHAR
SK.SAFI, Advocates
Visakhapatnam.
Cell : 9490385696
Visakhapatnam
Dt: 16.04.2024

BEFORE THE CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS AT KHAMMAM
DISPUTE NO. 387 OF 2021
M/s.Kapil Chits (Telangana) Private Limited, H.No. 4-1-14, 1st Floor, Main Road Yellandu, Town, Bhadradri Kothagudem District, Represented by its Branch Manager Cum Foreman,
...DISPUTANT
VERSUS
Mr. Kalthi Anil, & 4 Others
To
Opponent No.1. Kalthi Anil, S/o. Ramulu, Age: 33 years, Occ: Police Constable 15th Bettalion Sathupally, Emp.Id.No.046808, R/o. Panchoutukula pally(v), Kotthuru(p), Mulugu Mandal, Jayashankar Dist.
Opponent No.2. Burka Suryaprakash, S/o.Laxmaiah, Age: 38 years, Occ: Head Constable 15th Bettalion Sathupally, Emp.Id.No.045735, R/o.H.No.1-21, Gangaram(V), Kothaguda Mandal, Warangal District.
Opponent No.3. Badam Ram Murty Dora, S/o. Chinnayya Dora, Age: 31 years, Occ: Police Constable 15th Betalion, Sathupally, Emp.Id.127082, R/o.H.No.1-3, Iradapally(v), Paderu Mandal, Visakapatnam District.
Opponent No.4. Rega Chokka Rao, S/o. Babu, Age: 37 years, Occ: Pollice Constable 15th Betalion, Sathupally, Emp.Id.046827 R/o.H.No.5-79, Main Road, Kamaram (v), Thadvai Mandal, Jayashankar District.506344
...OPPONENTS
Whereas the disputant file the above Arbitration/ Dispute for the recovery of the money of **Rs. 1,69,961=00** against you and others and where as the above Arbitration/ Dispute is posted to 30-04-2024 for your appearance.
Take Notice that in default of your appearance in person before the Deputy Registrar of Chits/Arbitrator, Khammam on the above said date at 11:30 AM the matter will be determined setting you exparte.
Chit Arbitrator,
Deputy Registrar of Chits,
Khammam.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలి : ఎంపిపి రాంబాబు

ప్రజాశక్తి- పద్మనాభం : వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఎంపిపి రాంబాబు ఆదేశించారు. పద్మనాభం మండల కాంప్లెక్స్‌లోని ఎంపిడిఒ కార్యాలయం సమావేశం మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపిపి రాంబాబు హాజరై మండలంలోని పలు సమస్యలపై మాట్లాడారు. సమావేశంలో తాగునీటి సమస్యను సభ్యులు లేవనెత్తారు. ఎస్‌సి కాలనీలో తాగునీటి సమస్య ఉందని గంధవరం ఎంపిటిసి సభ్యులు రమణరాజు, బచ్చుపేట గ్రామంలోనూ నీటి సమస్య ఉందని బి.తాళ్లవలస సర్పంచ్ శ్రీను, లింగన్నపేటలో మోటార్లకు విద్యుత్ సరఫరా లేక తాగు నీటి సమస్య తలెత్తుతుందని బుద్దవలస సర్పంచ్ సూర్యనారాయణ సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై తాగునీటి సరఫరా ఎఇ వివరణ ఇస్తూ అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి పనులు జరుగుతున్నాయని వివరించారు. డయారియా రాకుండా అన్ని పంచాయతీల్లో 15 ఆరోగ్య శిబిరాలు ఏర్పాటుచేశామని రేవిడి పిహెచ్‌సి వైద్యధికారి కె.మణికుమారి తెలిపారు. వ్యవసాయ శాఖపై సమీక్షలో మొక్కజొన్న పంటపై చర్చించారు. మొక్కజొన్న పంటను పొలాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్నా, కొనుగోలు చేయడానికి ఎవరూ రైతుల వద్దకు వెళ్లక రోజులు తరబడి పొలంలోనే ఉండిపోతున్నారని, వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయడానికి సన్నాహాలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఎంపిపి ఆదేశించారు. ఉపాధి హామీ పనులపై ఎపిఒ వరలక్ష్మి వివరిస్తూ ఈ ఏడాది లక్ష్యాన్ని మించి పని దినాలు చేశామన్నారు. ఆ సమయంలో గంధవరం ఎంపిటిసి రమణ రాజు మాట్లాడుతూ, ఎంపిటిసి, సర్పంచులు సూచించిన చోట్ల ఉపాధి హామీ పనులు జరగడంలేదని ఆరోపించారు. దీనిపై ఎంపిపి రాంబాబు స్పందిస్తూ గ్రామసభల్లో ఆ గ్రామానికి సంబంధించి 20 పనులు గుర్తించి తీర్మానం చేశారని, ఆ మేరకు పనులు కొనసాగుతాయని తెలిపారు. ఎపిఒ ప్రభాకర్ మాట్లాడుతూ, మహిళామార్టు ఏర్పాటు, అమ్మకాల గురించి వివరించారు. విద్యాశాఖపై ఎంఇఒ మాట్లాడుతూ, కొన్ని గ్రామాల్లోని పాఠశాలలో కుళాయిలు కనెక్షన్లు తొలగించి పట్టుకుపోతున్నారని, ఇలాంటివి జరగకుండా సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ స్థాయి అధికారులు దృష్టిసారించాలని కోరారు. రహదారుల పనులపై ఆర్ అండ్ బి శాఖ అధికారి లలిత గౌరి వివరించారు. కొన్ని రహదారుల పనులు నిలిచిపోవడంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ ఎన్నికల కోడ్ ఉండడంతో కొన్ని పనులు ఆగిపోయాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బి.శైలజ, వైస్ ఎంపిపి రాజేశ్వరి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రాంబాబు

1200 ఓట్లు దాటితే వెబ్ కాస్టింగ్

ప్రజాశక్తి -భీమునిపట్నం : 1200 ఓట్లు దాటిన ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ కాస్టింగ్ విధానం ఏర్పాటుచేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. నియోజక వర్గంలో 220 పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ విధానాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. 85 ఏళ్ల పైబడిన వారు 1808 మంది ఉన్నారని, 40 శాతం వైకల్యం ఉన్న వారు 3,769 మంది ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో 86 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించామని తెలిపారు.

కణమాంలో పోలీస్ కవాతు

ప్రజాశక్తి- ఆనందపురం: ఎన్నికల నేపథ్యంలో స్థానిక పోలీసులు ఆధ్వర్యాన మంగళవారం కణమాం గ్రామంలో కవాతు నిర్వహించారు. సిఐ టివి.తిరుపతిరావు, ఎస్ఐలు సంతోష్, శివ ఆధ్వర్యాన సిఐఎస్ఎఫ్ జవాన్లతో జెండా కవత్ నిర్వహించారు. సిఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 94వ వార్డు పరిధి వేపగుంటకు చెందిన గ్రామ పెద్దలు ముత్తా నాయుడు, న్యాయవాది అక్కిరెడ్డి వినోద్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యాన మంగళవారం జనసేనలో చేరారు. పంచకర్ల గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని జనసేనలో చేరిన నాయకులు చెప్పారు. అనంతరం పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ, నేను రాజకీయంలో ఉన్నంతవరకు ఏ ఒక్క కార్యకర్తనూ వదులుకోనని హామీ ఇచ్చారు.

సూపర్ సిక్స్ పథకాలపై టిడిపి ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలోని సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ టిడిపి ఆధ్వర్యాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు అవగాహన కల్పించారు. ఆరిలోవ కాలనీ, జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. కాలనీ వాసులు, స్థానికులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు సాదరంగా స్వాగతం పలుకుతూ స్థానిక సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పొత్తకండ ధర్మారావు, యల్లమిల్లి సురేష్, మజ్జి రమణి, ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు.

పలుచోట్ల గంటా ఎన్నికల ప్రచారం

ప్రచారంలో పాల్గొన్న గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : స్థానిక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు మంగళవారం రాత్రి కెటిఎన్‌పేట, రాయిపాలెం, బ్యాంక్ కాలనీ జంక్షన్, చిల్లపేట, సంగివలస తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పాలనకు శ్రీకారం చుట్టింది టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ అని తెలిపారు. రూ.2కే కిలో బియ్యం, మహిళలకు ఆస్తిలో హక్కు, పక్కా గృహాలు, చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు తదితరాలు నందమూరి తారక రామారావు హయాంలో ప్రారంభమయ్యాయని వివరించారు. సంపద సృష్టి, ఆదాయ వనరులు పెంచుకోవడం తద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నా టిడిపితోనే సాధ్యమన్నారు. ముందుగా టిడిపి సీనియర్ నాయకులు యరబాల అనిల్ ప్రసాద్ గంటాను గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, మాజీ ఎంపిపి యర బాల కృష్ణవేణి, టిడిపి మండల అధ్యక్షులు డి ఎఎన్ రాజు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిక

పిఎం.పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి సాయి ప్రియ గార్డెన్స్ సమీపంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం కొమ్మాది ప్రాంతానికి చెందిన తలశిల విజయ్ మోహన్ ఆధ్వర్యాన 500 మంది వైసిపి నుంచి టిడిపిలోకి గంటా శ్రీనివాసరావు సమక్షంలో చేరారు.

కిమ్స్ ఐకాన్‌లో ఉచితంగా గ్రహణం మొర్రి శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి -గాజువాక : ఇంగా హెల్త్ ఫౌండేషన్ మద్దతుతో దోషి స్మైల్ సహాయంతో కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో మూడు నెలల వయసు నుంచి 18 సంవత్సరాల వయసు గల వారికి ఉచితంగా గ్రహణం మొర్రి శస్త్రచికిత్సలు చేస్తామని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సతీష్ కుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ టి.సాయి బలరామకృష్ణ తెలిపారు. ఈ ఉచిత శస్త్రచికిత్సల కోసం కిమ్స్ ఐకాన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రహణ మొర్రి సమస్య చాలా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఈ సమస్య ప్రతి 800 మంది పిల్లల్లో ఒకరికి వస్తుందని తెలిపారు. డాక్టర్ నితిన్ దోషి, డాక్టర్ లీనా దోషి సహాయంతో సుమారు రూ.1 లక్ష ఖర్చు అయ్యే ఆపరేషన్‌ను ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణశామరావు, డాక్టర్ చేతన, డాక్టర్ శ్యామ్ షేత్ తదితరులు పాల్గొన్నారు.

'టీసీ, స్టడీ లేకుండా అడ్మిషన్ల జిఒను సవరించాలి'

ప్రజాశక్తి -గాజువాక : బదిలీ ధ్రువపత్రం, స్టడీ సర్టిఫికెట్ లేకుండా ఏ విద్యార్థి అయినా ఏ పాఠశాలలోనైనా చేరవచ్చని తెచ్చిన జిఒను సవరించాలని ఆప్సా రాష్ట్ర నాయకులు కోరారు. ఈ మేరకు విద్యాకమిషనర్ ఎస్.సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ ప్రయివేట్ స్కూళ్లలో బకాయి ఫీజులు చెల్లించకుండా విద్యార్థులను వేరే స్కూళ్లలో చేర్పించడానికి తాము ప్రోత్సహించబోమని, దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కమిషనర్ చెప్పినట్లు ఆప్సా నాయకులు తెలిపారు. వినతి ఇచ్చినవారిలో అప్సా రాష్ట్ర చైర్మన్ సుందరం, అధ్యక్షుడు వి.సుబ్రహ్మణ్యంరాజు, ప్రధాన కార్యదర్శి టి.సింహాచలం, కోశాధికారి శ్రీహరి, ఫైనాన్షియల్ సెక్రటరీ పి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

హ్యుందాయ్ సర్వీస్ సెంటర్లలో సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి-సీతమ్మధార : లక్ష్మి హ్యుందాయ్ విశాఖపట్నం, బిర్లా జంక్షన్, గాజువాక, అనకాపల్లి, సిరిపురం, ఆటోనగర్, విజయనగరం సర్వీస్ సెంటర్లలో ఏసీ సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సంస్థ సిఇఒ బి.శ్రీనివాసరావు తెలిపారు. 40 పాయింట్ల ఎసి ఫ్రీ చెకప్, 10 శాతం స్పేర్ పార్ట్స్ డిస్కౌంట్, 10 శాతం లేబర్ డిస్కౌంట్ ఇస్తున్నట్లు వివరించారు. ఈ క్యాంపెయిన్ ఈ నెల 24వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. కొత్త కారు డిస్‌ప్లేతో డ్రైవ్, పాత కారు ఎక్స్ఛేంజ్ ఎవాల్యుయేషన్ ఉంటుందని, విశాఖ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వీస్ ఎటిఎం ఎమ్‌డి ప్రసాద్, లక్ష్మి హ్యుందాయ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న లక్ష్మి హ్యుందాయ్ ప్రతినిధులు

నేరాలు ఘోరాలు

హాల్ టికెట్ ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఫీజులు చెల్లించలేదని హాల్ టికెట్ నిలిపి వేయడంతో ఒక విద్యార్థిని తల్లి కళాశాల ఆవరణలో సెల్ఫీ వీడియోతో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటన పిఎం పాలెం సమీపంలోని సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాలలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి విద్యార్థిని తల్లి కథనం ప్రకారం... జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెం సమీపంలో ఉన్న సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాలలో ఈశ్వరి మూడో సంవత్సరం జి.ఉమామహేశ్వరి చదువుతోంది. జగనన్న విద్యా దీవెన ద్వారా డిప్లమో కోర్సులో చేరింది. చాలా మంది విద్యార్థులకు జెవిడి నగదు రాలేదు. దీంతో ఈ విద్యార్థులు కళాశాలకు ఫీజులు చెల్లించలేదు. విద్యార్థులకు ఈ నెల 18వ తేదీ నుంచి పరీక్షలు ఉన్నాయి. కళాశాల యాజమాన్యం దీనిని అవకాశంగా తీసుకుని ఫీజు చెల్లించిన వారికే హాల్ టికెట్లు ఇస్తామని చెప్పడంతో చాలా మంది విద్యార్థులు అప్పులు చేసి ఫీజు చెల్లించి హాల్ టికెట్లు అందుకున్నారు. విద్యార్థిని జి.ఉమామహేశ్వరి కుటుంబం పేద వారు తల్లి కనకేశ్వరి మంగళవారం కళాశాలకు వచ్చి ప్రిన్సిపల్ కాళ్లమీద పడి బ్రతిమిలాడినా హాల్ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఫోన్ ద్వారా వీడియో తీసుకుంటూ 'నా చావుకు కళాశాల యాజమాన్యమే కారణమని' చెబుతూ అక్కడే ఉరివేసుకొని ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించారు. దీంతో ఉమామహేశ్వరికి కళాశాల యాజమాన్యం హాల్ టికెట్ ఇచ్చింది.

వేర్వేరు చోట్ల 215 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ:తరలించడానికి సిద్ధంగా ఉంచిన 207 కేజీల గంజాయిని పట్టుకున్నామని నర్సీపట్నం డీఎస్పీ మోహన్ తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలను ఆయన వెల్లడించారు. నర్సీపట్నం రూరల్ సీఐ హరి, ఎస్సైలు ఉపేంద్ర, రామకృష్ణల ఆధ్వర్యంలో కృష్ణదేవిపేట అల్లూరి పార్కు వద్ద మంగళవారం ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళు తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారని తెలిపారు. పార్కు సమీప ప్రాంతంలో తరలించడానికి సిద్ధంగా గంజాయిని నిల్వలు ఉంచినట్లు తేలిందన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకొని రోలుగుంట మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన హరిబాబు, కొయ్యూరు మండలం డౌనూరుకు చెందిన సతీష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారులో ఉన్నారన్నారు. వీరి వద్ద నుంచి ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

చీడికాడ:మండలంలోని వరహాపురం గ్రామ శివార్లలో వాహనాల తనిఖీ చేస్తుండగా 8 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రెండు ద్విచక్ర వాహనాలపై ముగ్గురు వ్యక్తులు వస్తుండగా గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో డ్రైవర్లతో గణబాబు సమావేశం

ప్రజాశక్తి -గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు కార్యాలయంలో మంగళవారం ఆటో డ్రైవర్ల సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీని గెలిపించాల కోరారు. అనంతరం ఆటో డ్రైవర్లు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గణబాబు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ఆటో డ్రైవర్లు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డు పరిశీలకులతో చొక్కాకుల సమీక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ ఉత్తర నియోజకవర్గం వైసిపి కార్యాలయంలో పార్టీ వార్డు పరిశీలకులతో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎవరికి కేటాయించిన వార్డులలో వారు ప్రచారం నిర్వహించి వైసిపి విజయానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భరణికాన రామారావు, బులుసు జగదీష్, రేవతిరావు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ ఒకేషనల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-వేపగుంట : శంకర్ ఫౌండేషన్ వృత్తి విద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు నర్స్, ఆప్తాల్మిక్ టెక్నీషియన్‌లో ఉత్తమ ఫలితాలను సాధించారని ప్రొఫెసర్ పి.కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 95 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. మొదటి సంవత్సర పరీక్షల్లో డి.నాగశ్యామల 534/600 మార్కులు, ద్వితీయ సంవత్సరంలో ఎస్‌కె.వహీదా 1163/1300 మార్కులు సాధించారని తెలిపారు.

కలం మాట

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
బుధవారం 17
ఏప్రిల్ 2024



ఓటు విలువ

ఓటు విలువ తెలుసుకోరా సోదరా!
అమ్మేందుకు ఓటు సరుకు కాదురా
భవిత కొరకు, బతుకు కొరకు ఓటు ఆయుధం
మంచోళ్లను గెలిపించడమే కీలకం
మన ఊరూ, మన వార్డు అభివృద్ధి కోసం
మన కోసం ఆలోచించే నేతలే కదా కీలకం
అవినీతిపరులకు అధికారం ఇవ్వకూడదు.
మోసగాళ్ల వలలో అసలే పడకూడదు
తెలివిగా ఆలోచించి వెయ్యాలీ ఓటు
బాధ్యత గల నేతకు ఇవ్వాలి సీటు.

రచన: ఎం.చంటి, విశాఖపట్నం, సెల్ : 91005 50706

వికలాంగులు, వయోవృద్ధులైన ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

- జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

జెసి మయూర్ అశోక్

ప్రజాశక్తి- విశాఖపట్నం :సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వయోవృద్ధులు, వికలాంగులు సౌకర్యవంతంగా ఓటు వేసేందుకు వీలుగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తూర్పు నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్పష్టం చేశారు. ప్రతి పోలింగ్‌స్టేషన్ వద్ద వీల్‌చైర్లు ఏర్పాటు చేస్తున్నామని, క్యూలైనుతో సంబంధం లేకుండా వికలాంగులు, వృద్ధులు నేరుగా వెళ్లి ఓటు వేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం ఎన్నికల సన్నద్ధతపై కలెక్టరేట్‌లో సెక్టోరియల్ అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ జారీకానున్న నేపథ్యంలో, వచ్చేనెల 13న పోలింగ్ ముగిసే వరకు రానున్న నెల రోజులు చాలా కీలకమన్నారు. సెక్టార్ అధికారులు మరింత ఉత్సాహంగా, బాధ్యతతో పనిచేయాలని సూచించారు. తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్ల వివరాలతో పాటు ఓటర్లకు చెందిన సమగ్ర సమాచారం సెక్టార్ అధికారులకు పూర్తిగా ఉండాలని సూచించారు.సెక్టార్ అధికారులకు అందరికంటే ముందుగా తమ నియోజకవర్గంలో వాహనాలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఆ వాహనాలను వినియోగించి ప్రతిరోజూ తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి, మొత్తం సమాచారాన్ని సేకరించాలన్నారు. ఇందుకు బిఎల్‌ఒలు, రూట్ అధికారులు, సూపర్వైజర్లతో తరచూ సమీక్షలు నిర్వహించి, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏవైనా సమస్యలుంటే తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సూచించారు. అనెగ్జర్ -3 లో పేర్కొన్న పిఎస్ తుది పోలింగ్‌స్టేషన్ అవుతుందన్న సంగతిని అందరూ గుర్తెరగాలన్నారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని పిఎస్‌ల్లో ర్యాంపులు, విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధంచేసుకోవాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఓటర్ల సంఖ్య ఆధారంగా పోలింగ్‌కు ముందురోజున అవసరమైన టెంట్లను సంబంధిత అధికారులతో మాట్లాడి వేయించాలని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో శతశాతం సిసి కెమెరాలు ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఓటరు స్లిప్పుల జారీలో సెక్టార్ అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని, స్వీప్ కార్యక్రమం మరింత జోరుగా సాగేలా చర్యలు చేపట్టాలని ఇఆర్ఒ ఆదేశించారు. సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

అన్నింటినీ మించిన నేరం
అన్యాయంతోనూ,
అక్రమంతోనూ
రాజీ పడటమే...
- సుభాష్ చంద్రబోస్

సార్వత్రిక సంగ్రామం

ప్రచార పర్వంలో ఎవరెలా..?

- స్థానిక సమస్యలను వదిలేసి సంక్షేమ పథకాల పేరుతో ముందుకెళ్తున్న వైసిపి
- బిజెపితో పొత్తుతో ఇరకాటంలో పడ్డ టిడిపి
- ప్రజా సమస్యలే అజెండాగా సిపిఎం, ఇండియా ఫోరం అభ్యర్థులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాగల సార్వత్రిక ఎన్నికల్లో గెలిచేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. ప్రచారపర్వంపై దృష్టి సారించి ముందుకెళ్తున్నాయి. వారి ప్రచారతీరుపై జనంలోనూ చర్చ సాగుతోంది. విశాఖ పార్లమెంట్ పరిధిలోని తూర్పు, పశ్చిమం, దక్షిణం, ఉత్తరం, అలాగే భీమిలిలో వైసిపి అభ్యర్థుల ప్రచారం చాలా రోజుల క్రితమే ప్రారంభమైంది. తెలుగుదేశం, జనసేనలు బిజెపితో పొత్తుపెట్టుకునే క్రమంలో సీట్ల సర్దుబాటు, పంపకాల్లో జరిగిన ఆలస్యం ప్రచారంపైనా ప్రభావం చూపింది. సంక్షేమ పథకాలు, జగన్ ఛరిష్మా గెలిపిస్తాయని వైసిపి అభ్యర్థులు చెబుతున్నారు. అందరికీ సంక్షేమం అందిందని చెబుతూ ముందుకెళ్తున్నారు. స్థానిక సమస్యలపై మాత్రం వారు నోరు విప్పడం లేదు. వాస్తవానికి పట్టణంలోని మురికివాడలు, పేదలు ఎక్కువగా నివసించే ప్రాంతాల్లో నేటికీ సమస్యలు అలానే ఉన్నాయి. ఉత్తర నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉంది. కొండవాలు ప్రాంతాల్లో ఉన్నవారిని ఎక్కువగా ఈ సమస్య వేధిస్తోంది. ఆస్తి, చెత్త పన్ను భారాలు ఉండనే ఉన్నాయి. ఆయా సమస్యలపై మాత్రం వైసిపి అభ్యర్థులు ఎక్కడా నోరుమెదపడం లేదు. పంచగ్రామాలు, విశాఖ ఉక్కు సమస్యలపైనా మౌనంగానే ఉంటున్నారు. అంతా బాగుందన్నట్టు వారి ప్రచారం సాగుతోంది.

బిజెపితో పొత్తు వల్ల టిడిపి ఇరకాటంలో పడింది. ఎపికి ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్ ఇవ్వకుండా, పోలవరం నిర్మాణానికి సహకరించకుండా, వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తాం.. లేదంటే మూసేస్తాం అనే పద్ధతిలో దేశంలో పాలన సాగిస్తున్న బిజెపితో పొత్తు వల్ల విశాఖలో కూటమికి నష్టమే జరగనుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2047 నాటికి దేశాన్ని, ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచంలోనే ఉన్నతికి తీసుకెళ్లే స్కెచ్ ప్రధాని మోడీ వద్ద ఉందని టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల ఉమ్మడి విశాఖలో జరిగిన ప్రచార సభల్లో ఊదరగొట్టినా, జనం నమ్మే పరిస్థితిలో లేరు. దీంతో విశాఖలో కూటమి పరిస్థితి పలుచబడింది. గాజువాకలో వేలాది సంఖ్యలోగల ఉక్కు కార్మికులు, వారి కుటుంబ సభ్యులు, విశాఖ జిల్లా ప్రజలు, సిపిఎం, వామపక్షాల నేతలు బిజెపి ఉక్కు ప్రైవేటీకరణ విధానంపై మూడేళ్లుగా పోరాడుతూ ఉండడంతో ఈ ప్రచార ప్రభావం విశాఖ పార్లమెంట్ పరిధిలో బలంగానే వెళ్లింది. ప్రజా సమస్యలు 'కూటమి'ని ఇరకాటంలో పడేస్తున్నాయన్న చర్చ నడుస్తోంది. పంచగ్రామాల సమస్య పరిష్కారానికి తాము ఏం చేస్తామన్నది కూటమి నేతలు ఇప్పటికీ చెప్పలేదు. ఈ విషయంపైనా తూర్పు, పశ్చిమ, పెందుర్తి నియోజకవర్గాల్లో చర్చ జరుగుతోంది.

జనంలోకి సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ అభ్యర్థులు

ఇండియా ఫోరంలోని కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ అభ్యర్థులు ప్రజా సమస్యలను తెలియజేస్తూ తాము గెలిస్తే ఏం చేస్తామన్నది నిర్దిష్టంగా చెబుతూ ప్రచారం సాగిస్తున్నారు. సిపిఎం గాజువాక నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ఇప్పటికే వార్డుల్లో ప్రచార జోరు పెంచారు. వాకర్స్‌ను, స్థానిక సంఘాల నాయకులను, చిరు వ్యాపారులను, కార్మికులను విస్తృతంగా కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఆయన ప్రచారం సాగుతోంది. బిజెపిని, దానికి మద్దతునిస్తున్న టిడిపి, జనసేనలను, వినాశకర వైసిపిని ఎందుకు ఓడించాలో ఆయన ప్రజలకు వివరిస్తున్నారు. సిపిఐ పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి అత్తిలి విమల కూడా ఇప్పటికే ప్రచారంలో ముందున్నారు. కమ్యూనిస్టులు ఎందుకు గెలవాలో చెబుతున్నారు. కాంగ్రెస్ నుంచి భీమిలి నియోజకవర్గంలో బరిలో ఉన్న అడ్డాల వెంకట వర్మరాజు, తూర్పు అభ్యర్థి గుత్తుల శ్రీనివాస్, దక్షిణ అభ్యర్థి వాసుపల్లి సంతోష్ ప్రజలకు పరిచయమవుతూ తమదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా

కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి-అనకాపల్లి : కాంగ్రెస్ పార్టీ ద్వారానే రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి ఐఆర్.గంగాధర్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎపిసిసి అధ్యక్షులు వైయస్ షర్మిల ఆధ్వర్యంలో రూపొందించిన రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కుటుంబంలో ఒక మహిళకు లక్ష రూపాయలు చొప్పున మహాలక్ష్మి పథకం కింద మంజూరు చేస్తామని, రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని, మద్దతు ధర కల్పిస్తామని, ఉపాధి హామీ కూలీలకు కనీసం రూ.400 వేతనం ఇస్తామని, ఎల్కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందిస్తామని, వృద్ధులకు, వితంతువులకు రూ.4000 వికలాంగులకు రూ.6000 పింఛను మంజూరు చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు దాసరి సంతోష్ కుమార్, సనేడ గజ్జాలు, ఎక్కడ భాస్కరరావు, కొల్లి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

'తూర్పు'లో ఎంవివి ప్రచారం

పెదజాలరిపేటలో ప్రచారం చేస్తున్న ఎంవివి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వైసిపి విశాఖ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎంపి ఎంవివి సత్యనారాయణ 90వ రోజు పాదయాత్ర, ఎన్నికల ప్రచారం మంగళవారం కొనసాగింది. పెదజాలరిపేట నుంచి వార్డు వైసిపి ఇన్‌ఛార్జి సూరాడ వెంకటలక్ష్మి దాస్‌తో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధ్యం కాని హామీలతో చంద్రబాబు మళ్లీ వస్తున్నాడని, ఆయనకు ఓటేస్తే పథకాలన్నీ కూడా మునిగిపోతాయన్నారు. కూటమి కుట్రలను ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు.కార్యక్రమంలో సూరాడ దాస్, వాడమోదుల గణేష్, వైసిపి శ్రేణులు, మహిళలు, పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం పోరాడే వారిని చట్టసభలకు పంపించాలి

మాట్లాడుతున్న ఎం జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం పోరాడే వ్యక్తులను చట్టసభలకు పంపించాలని ఇండియా ఫోరం బలపరిచిన సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు కోరారు. జివిఎంసి 72వ వార్డులో వివిధ ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు వల్ల గాజువాక పరిసర ప్రాంతాల్లో అనేక ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు ఏర్పడ్డాయని తెలిపారు. దీనికి అనుగుణంగా అనేక వ్యాపార సంస్థలు ఏర్పడి లక్షలాదిమందికి ఉపాధి లభించిందని వివరించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడంలో ప్రయివేటు విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు తోడ్పాటు ఇవ్వాలని కోరారు. స్టీల్ ప్లాంట్ రక్షణ కోసం పోరాటం చేస్తున్న తనను సిపిఎం తరపున గెలిపించి, అసెంబ్లీకి పంపించాలని కోరారు. ఎస్‌వికె.పరశురాం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో శ్వేతశ్రీ స్కూలు, రవీంద్ర స్కూల్, రవీంద్ర ఇండియన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీ రాఘవేంద్ర స్కూల్స్ టీచర్లు, కరస్పాండెంట్లు ఎస్.గంగేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, సిపిఎం విశాఖ జిల్లా కమిటీ సభ్యులు ఆర్ఎస్ఎన్.మూర్తి, సిఐటియు నాయకులు భాస్కరరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జై భారత్ పార్టీ ప్రచారం

ప్రచారం చేస్తున్న జైభారత్ పార్టీ శ్రేణులు

ప్రజాశక్తి -మధురవాడ : భీమిలి నియోజకవర్గం పరిధి తగరపువలస నమ్మివాని పేటలో జై భారత్ పార్టీ సభ్యులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఇలిపిల్లి అనిల్‌కుమార్ మాట్లాడుతూ, తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువత పాల్గొన్నారు.

ఓటర్ల సంఖ్యాపరంగా జిల్లాలో భీమిలి టాప్!

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ మహిళా ఓటర్లే అధికం



ప్రజాశక్తి -భీమునిపట్నం: భౌగోళిక విస్తీర్ణంలోనే కాదు...ఓటర్ల సంఖ్యాపరంగా భీమిలి నియోజకవర్గం జిల్లాలోనే టాప్‌గా తన ప్రత్యేకతను చాటుకుందనే చెప్పాలి. నియోజకవర్గంలో మొత్తంగా 3లక్షల 60 వేల 507 మంది ఓటర్లు ఉండగా, వారిలో మహిళలు లక్షా 83 వేల 632 మంది, పురుషులు లక్షా 76 వేల 860 మంది ఉన్నారు. ఇతరులు 15 మంది ఉన్నారు. పురుషులు కంటే మహిళా ఓటర్లే 6,772మంది ఓటర్లు అధికంగా ఉండడం ఇక్కడ మహిళా చైతన్యాన్ని స్పష్టం చేస్తోంది.

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

ఇక మండలాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి. పద్మనాభం మండలంలో మొత్తంగా 42,033 మంది ఓటర్లుంటే, వారిలో మహిళలు 21,464 మంది, పురుషులు 20,569 మంది ఉన్నారు. ఆనందపురం మండలంలో మొత్తం ఓటర్లు 51,224 మంది కాగా వారిలో మహిళలు 25,924 మంది, పురుషులు 25,300 మంది ఉన్నారు. భీమిలి మండలంలో మొత్తం ఓటర్లు 1,01,892 మంది ఉన్నారు. వారిలో మహిళలు 52,214 మంది, పురుషులు 49,675 మంది ఉన్నారు.విశాఖ రూరల్ మండలంలో మొత్తంగా 1,65358 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 84,030 మంది, పురుషులు 81,316 మంది ఉన్నారు. ఇతరులు 15 మంది ఉన్నారు. నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లోనూ పురుషులు కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండడం విశేషం.

మూల స్వయంవరం గ్రామాన్ని తరలించాలని ఆందోళన

ప్రజాశక్తి- పరవాడ : మండలంలోని కలపాక పంచాయతీ పరిధి మూల స్వయంవరం గ్రామాన్ని తరలించాలని మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్టిపిసి కాలుష్యంతో గ్రామంలో తీవ్రమైన అనారోగ్యాల పాలవుతున్నారని గ్రామాన్ని తరలించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దుమ్ము,ధూళి నీటి తుంపర్ల నుండి రక్షించాలని గ్రామస్తులు కోరారు. కాలుష్యకోరలలో చిక్కుకొని గ్రామంలో మంచినీరు కొనుక్కొని తాగవలసిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం వలన వ్యవసాయ ఉత్పత్తి రావడంలేదని, పశువులు అనారోగ్యాలు గురవుతున్నాయని పేర్కొన్నారు. మనుషులకు శ్వాస, కిడ్నీ, కంటి సమస్యలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కొత్తపల్లి బాబురావు, భాను, ప్రసాద్, రమణ, లక్ష్మి, పాల్గొన్నారు

మృతుని కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-అచ్చుతాపురం : కంటైనర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందిన అఖిల్ బౌరి కుటుంబానికి పరిహారం చెల్లించి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము డిమాండ్ చేశారు. వలస కార్మికులను ఆయన మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పోషణ నిమిత్తం పశ్చిమ బెంగాల్ బంకురా గ్రామానికి చెందిన అఖిల్ గౌరీ పిడి లైట్ పరిశ్రమల కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడని తెలిపారు. ప్రమాదవశాత్తు కుమారపురం గ్రామం రోడ్డుపై అతనిని లారీ ఢీకొట్టడంతో సంఘటనా స్థలంలో మృతి చెందాడని పేర్కొన్నారు. అతని కుటుంబానికి పరిహారం చెల్లించి న్యాయం చేయాలని ఆయన యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

సరుగుడు తోటలు అగ్నికి ఆహుతి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని పెద్దమదీన గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 30 నుండి 40 ఎకరాల్లో సరుగుడు తోటలు కాలిపోయాయి. ప్రమాదవశాత్తు జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో నమ్మి శ్రీను, గడదాసు సత్తిబాబు, మల్లారపు కేడర్, దంద్రు గోవిందా, దంద్రు రాబడి,దంద్రు కొండలరావు, గుర్రం అప్పారావు, మల్లారపు నాగరాజు, తదితరులకు చెందిన మూడు నాలుగు సంవత్సరాల వయసు గల సరిగుడి తోటలో కాలిపోయాయి సుమారు 30 లక్షల నుండి 40 లక్షల రూపాయల పైగా ఆస్తి నష్టం సంభవించిందని గ్రామస్తులు తెలిపారు.

మేమంతా సిద్ధం యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-దేవరాపల్లి : ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర ఈ నెల 20న జిల్లాలో ప్రవేశిస్తుందని, దానిని జయప్రదం చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని తారువలో వైసీపీ మండల అధ్యక్షులు బూరె బాబురావు అధ్వర్యంలో స్థానిక నాయకులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ, జడ్పీటీసీ కర్రి సత్యం పాల్గొన్నారు.

వైసిపి పాలనలో గ్రామాలు అంధకారం

ప్రజాశక్తి- అనకాపల్లి : రాష్ట్రంలో వైసిపి పాలనలో గ్రామాలు అంధకారంలోకి వెళ్లాయని అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ విమర్శించారు. మండలంలోని కూండ్రం, రొంగలివానిపాలెం, కుంచంగి గ్రామాలలో ఉపాధి హామీ కూలీల మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ట్రిబుల్ ఇంజిన్ సర్కారుతోనే సమగ్రాభివృద్ధి సాధ్యమని రామకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి తనయుడు రిత్విక్, ఆయా పార్టీల నాయకులు, పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి -చోడవరం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఫైర్ స్టేషన్ అధికారులు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా ఎదుర్కోవాలో ప్రాక్టికల్‌గా విద్యార్థులపై చేయించారు. ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ బివి రామస్వామి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాధాకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కిరణ్ కుమార్, ఏఎఫ్ఓ రాము, డాక్టర్ రత్న భారతి, బిచ్చమ్మ, డి.మాల్యాద్రి పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ఆర్కిడ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు అగ్నిప్రమాదాలు, విపత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫైర్ ఆఫీసర్ జివి.సత్యరాజు వరదలు, భూకంపాలు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఫైర్ సిబ్బంది కె.రాజారావు, కె.యల్లాజీ, ఎం శ్యామ్ కుమార్, కె.మహేశ్వరరావు, వి.ద్వారకాద్రి, పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి

చెక్ పోస్టులు, డైనమిక్ చెక్ పోస్టులలో ముమ్మర తనిఖీలు చేసి డబ్బు, మద్యం ఇతర ఉచిత కానుకలు దొరికితే సీజ్ చేయాలని జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. దర్యాప్తులో ఉన్న సాధారణ, తీవ్రమైన, ముఖ్యమైన కేసులు, ప్రాపర్టీ కేసులు, పోక్సో యాక్ట్ కేసులు, 174 సి.ఆర్.పి.సి. కేసులు, గంజాయి కేసులు, మిస్సింగ్ కేసులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఆయా కేసుల్లో దర్యాప్తు పెండింగులో ఉండడానికి గల కారణాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని, త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయుటకు పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ కేసుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులకు సిబ్బందికి (పై రెండు కేసులలో 25 మందికి) ప్రశంసా పత్రాలు, నగదు చెక్కులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయ భాస్కర్, డీఎస్పీలు ఎస్.అప్పలరాజు, కె.వి.సత్యనారాయణ, జి.ఆర్.ఆర్.మోహన్, బి.అప్పారావు, ఎం.ఉపేంద్ర బాబు, పి.నాగేశ్వరరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలను కలిసిన భరత్‌కుమార్

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ మంగళవారం అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి మాట్లాడారు. తనకు అవకాశం ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి, ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఓట్లును ఫ్యాను గుర్తుపై వేసి తమను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వెస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ వీల్లూరి సూర్య కుమారి శేఖర్, గ్రామ సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైసిపి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద తదితరులు పాల్గొన్నారు.

మండలం తుమ్మపాలలో దంతులూరి దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో వైసిపి అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ మంగళవారం గడపగడపకు వైసిపి ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ముందుగా గంగాలమ్మ పుట్టని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాన్ని అందజేసి తనకు ఓటు వేయమని అభ్యర్థించారు.

జీవీఎంసీ 80వ వార్డులో ఆ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ సోదరుడు కుమార్ రాజా ఆధ్వర్యాన ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కొణతాల మురళీకృష్ణ, వేగి త్రినాథ్, దాడి శివ, కొణతాల సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగానికి కందుకూరి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- మునగపాక : తెలుగు నాటక రంగానికి కందుకూరి వీరేశలింగం పంతులు చేసిన సేవలు మరువలేనివని గ్రామీణ సాంస్కృతిక సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము పేర్కొన్నారు. తెలుగు నాటక రంగ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ప్రాథమిక సహకార సంఘం ఆవరణలో మంగళవారం కళాకారుల, దర్శకులు, రచయితల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తెలుగు నాటక రంగాన్ని ప్రపంచ నలు దిశల చాటిచెప్పిన నాటక రంగ దిగ్గజాలను కళాకారులు గుర్తుచేసుకొని నాటక రంగానికి ఉతం ఇవ్వవలసిన బాధ్యత ప్రతి కళాకారులపైన ఉందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామీణ యువజన మందిరం అధ్యక్షులు టెక్కలి కొండలరావు, కార్యదర్శి ఆడారి స్వామి శేఖర్, రచయిత ఇల్లూరి జగ్గప్పారావు, రంగస్థల నటులు పీలా వెంకట అప్పారావు, పెంటకోట రాము, కళాభిమాని పెంటకోట వెంకటరావు పాల్గొన్నారు.

వీరేశలింగం జయంతి వేడుకలు

కశింకోట : కసింకోట మండలం నూతనగుంటపాలెం గ్రామంలో కందుకూరు వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి, సోమవారం గ్రామ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు కందుకూరి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గొంతిన చిరంజీవి, నైనంశెట్టి రమణారావు, ఎలమంచిలి వెంకట్రావు, కర్రి దుర్గ నాయుడు, జెర్రిపోతుల నూకు నాయుడు, అందే రమణ, నారిపల్లి ప్రసాద్, కోన సత్తిబాబు, తెరపిల్లి శ్రీను, కోన రమణ, పూడి మణికంత, చోడే నాగరాజు పాల్గొన్నారు

పార్టీ మారిన వారు పదవులకు రాజీనామా చేయాలి

ప్రజాశక్తి -వడ్డాది : పార్టీ మారిన వారికి నైతిక విలువలు ఉంటే తమ పదవులకు రాజీనామా చేసి పార్టీ మారాలని వడ్డాది పట్టణ వైసిపి అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, డిసిసిబి మాజీ డైరెక్టర్ కోవెల జనార్ధన రావు, ఎంపీటీసీ రమణ డిమాండ్ చేశారు. మంగళవారం వడ్డాదిలో వారు మాట్లాడుతూ కొంతమంది వైసిపి వలన పదవుల పొందిన సర్పంచ్ కోరుకొండ కామ లక్ష్మి, ఉపసర్పంచ్ దాడి సూర్య నాగేశ్వరావు తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. వ్యక్తిగత స్వార్థంతోనే దొండా సన్యాసిరావు పార్టీ మారాడన్నారు. పార్టీ మారిన వారి వలన వడ్డాదిలో వైసీపీకి ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇంటి అప్పారావు, వైసీపీ నేతలు చింతల శంకర్రావు, భాస్కరరావు, కొండబాబు పాల్గొన్నారు.

19న గురుకుల కళాశాలలో సీట్లు భర్తీకి కౌన్సెలింగ్

ప్రజాశక్తి - కశింకోట : మండలంలోని తాళ్లపాలెం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో ప్రథమ ఫేస్‌లో కన్ఫర్మేషన్ అవగా మిగిలి ఉన్న సీట్లు భర్తీకి ఈ నెల 19న కౌన్సిలింగ్ ఉందని ప్రిన్సిపల్ ఈ గ్రేస్ మంగళవారం తెలిపారు. అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లోని తాళ్లపాలెం, కొక్కిరాపల్లి, నక్కపల్లి, నర్సీపట్నం, మేఘాద్రి గడ్డ, కోనాం, సిఓఈ మధురవాడ ఈ ఏడు బాలికల గురుకుల పాఠశాలలకు 19 వ తేదీన కౌన్సిలింగ్ తాళ్లపాలెం గురుకులంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.˜ల్లిదండ్రులు తమ పిల్లలతో ఆ రోజు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

పరవాడపాలెంలో పీస్ కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి- కశింకోట : కొన్ని రోజులుగా మండలంలోని పరవాడపాలెం గ్రామంలో చిన్నచిన్న గొడవలు జరుగుతున్న నేపథ్యంలో డిఎస్‌పి ఎస్ అప్పలరాజు ఆధ్వర్యాన సోమవారం రాత్రి పీస్ కమిటీలు ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు గ్రామ పెద్దలు, కుల పెద్దలు, అన్ని వర్గాల గ్రామ పెద్దలతో కలిసి ఈ పీస్ కమిటీని ఏర్పాటు చేసినట్టు డిఎస్‌పి తెలిపారు. సిఐ వినోద్ బాబు, ఎస్ఐ రమేష్ బాబు, పాల్గొన్నారు.

కూటమి నేతల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి-సబ్బవరం : టిడిపి, జనసేన, బీజేపీ నాయకుల ఆత్మీయ సమావేశం మండలంలోని మొగలిపురం గ్రామంలో విశాఖ జిల్లా టిడిపి అధ్యక్షుడు గండి బాబ్జి నివాసంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో గండిబాబ్జి, అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, పెందుర్తి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు, మూడు పార్టీల నాయకులు మిడతాడా మహాలక్ష్మి నాయుడు, గండి ముత్యాలనాయుడు, గండి దేముడు తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

పరవాడ : మండలంలోని పెద్దముసిడివాడ పంచాయితీ గండివానిపాలెం గ్రామంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కరణం నరసింగరావు ఆధ్వర్యంలో జనసేన నూతన కార్యాలయాన్ని మంగళవారం జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరవాడ మండల జనసేన పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

కూటమి నాయకులతో పైలా సమావేశం

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలం కేంద్రం కె.కోటపాడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులతో మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాడుగులలో టీడీపీకి పూర్వ వైభవం పునరుద్ధరణకు అందరూ సమన్వయం, సమిష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో ఆయా పార్టీల నాయకులు రొంగలి మహేష్, డోకల నరసింహమూర్తి, కన్నూరు నాగభూషణం, జూరెడ్డి రాము, చౌడువాడ, కొరువాడ, కెజె.పురం సర్పంచ్‌లు దాడి ఎరుకునాయుడు, సింగంపల్లి నారాయణమూర్తి, యడ్ల రమేష్, కొరువాడ, మేడిచర్ల మాజీ ఎంపీటీసీలు చీపురుపల్లి రామారావు, పూడి నారాయణమూర్తి, మర్రివలస మాజీ సర్పంచ్ సీమిసురు రమణ, నాయకులు పాల్గొన్నారు.

జనసేన అభ్యర్థి సుందరపు ప్రచారం

ప్రజాశక్తి- అచ్యుతాపురం : మండలంలోని ఉప్పవరం, ఎర్రవరం, నరేంద్రపురం గ్రామాలలో జనసేన పార్టీ ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్ కుమార్ మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. గాజు గ్లాసుకు ఓట్లు వేసి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో టిడిపి నేత జనపరెడ్డి నర్సింగరావు, ఉపసర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు, జనసేన నేత బి.రాందాస్, మాజీ జెడ్పిటిసి సభ్యుడు జె శ్రీనివాసరావు పాల్గొన్నారు. మండలంలోని మడుతురు గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్ద జనసేన పార్టీ జిల్లా మహిళా కార్యదర్శి ఎం త్రివేణి ప్రచారం చేశారు.

ఫస్ట్ ఇంటర్‌లో సంప్రీత్‌కు రాష్ట్ర 3వ ర్యాంకు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి గవరపాలేనికి చెందిన కాండ్రేగుల సంప్రీత్ ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీ గ్రూపులో రాష్ట్రంలో మూడో ర్యాంక్ సాధించారు. గాజువాక శ్రీ చైతన్య కళాశాలలో చదువుతున్న సంప్రీత్ 470 మార్కులకుగాను 465 మార్కులు సాధించి రాష్ట్రంలోనే మూడవ ర్యాంకు సాధించారని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు సంప్రీత్ తల్లిదండ్రులు కాండ్రేగుల సోమాజీ, అను దంపతులతో పాటు స్థానిక పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

రవీంద్ర భారతిలో బాలల స్నాతకోత్సవం

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక దాసరి గడ్డ రవీంద్ర భారతి పాఠశాలలో బాలల స్నాతకోత్సవ వేడుకలు మంగళవారం ఎంతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యురాలు హారిక విచ్చేసి యూకేజీ పిల్లలకు ప్రశంస పత్రాలు అందజేశారు. ప్రిన్సిపల్ జగదీష్ ప్రసంగించారు. కార్యక్రమంలో జెడ్ ఐ వెంకటేష్, ఏజీఎం మూర్తి, డిఐ గోవింద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన రఘునాథ్



చంద్రబాబుతో రఘునాథ్

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త ఆదినారాయణ మహిళా కళాశాల కరెస్పాండెంట్, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ సోదరుడు కొణతాల రఘునాథ్ మంగళవారం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీష్‌తో కలిసి బొబ్బిలి పర్యటనలో ఉన్న చంద్రబాబును ఆయన కలిసారు. రఘునాథ్‌కు పార్టీ కండువా కప్పి చంద్రబాబు సాదరంగా ఆహ్వానించారు. కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని చంద్రబాబు సూచించారు.

గెలుపునకు కృషి చేయాలి

-వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు గణేష్, జోగులు, ధర్మశ్రీ

ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:వచ్చే ఎన్నికల్లో 30వేల మెజార్టీ సాధిస్తామని నర్సీపట్నం వైసిపి అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ జోస్యం చెప్పారు. మంగళవారం నర్సీపట్నం మున్సిపాలిటీ 9వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తాను శాసనసభ్యుడిగా ఉంటూ రూ.500 కోట్లతో మెడికల్ కళాశాలను తీసుకు వచ్చానన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనే సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, వైసీపీ పట్టణ అధ్యక్షులు ఏకా శివ, జగనన్న సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీను పాల్గొన్నారు.

కోటవురట్ల:మండల వ్యాప్తంగా ఇటీవల రాజీనామా చేసిన సచివాలయ వాలంటీర్లతో మంగళవారం తంగేడు గ్రామంలోని మాజీ డిసిసిబి అధ్యక్షులు రామచంద్రరాజు స్వగృహం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు మాట్లాడుతూ, పార్టీ గెలుపునకు శక్తి వంచన లేకుండా పని చేయాలని సూచించారు. వచ్చిన వారందరికీ భోజనాలు ఏర్పాటు చేయడం విశేషం.

కొత్తకోట:కూటమి పార్టీల అభ్యర్థులకు దండిగా రూ. కోట్లు ఉంటే మనకు ప్రజల ఓట్లు ఉన్నాయని ప్రతి కార్యకర్త గెలుపే ధ్యేయంగా పని చేయాలని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ కోరారు. రావికమతం, కొత్తకోట గ్రామాలలో జరిగిన కార్యకర్తల, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు రూ.కోట్లున్న అభ్యర్థులకే టిక్కెట్లు ఇచ్చాడని, వాళ్లెన్ని కోట్లు కుమ్మరించినా ప్రజల ఓట్లు మాత్రం మనకే దండిగా పడతాయన్నారు.ప్రభుత్వ పథకాల పై ప్రచారం చేయాలని, ప్రజల అభిమానాన్ని ఓట్లుగా మారల్చాలన్నారు. కొత్తకోట గ్రామంలో టిడిపి కి చెందిన యర్ర శ్రీను, కుంచా గణేష్, జోగాడ భూలక్ష్మి, గ ట్రెడ్డి శ్రీనులు ధర్మశ్రీ సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పైల రాజు, జెడ్పిటిసి తలారి రమణమ్మ ఆదిమూర్తి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాదరావు, వైసీపీ నాయకులు శీలం గోవిందరావు, శంకరరావు, సర్పంచ్ కొన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ, పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

పెన్సిల్ ముల్లుపై శ్రీరాముని ప్రతిరూపం

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ గ్రహీత, సూక్ష్మ కళాకారుడు, డాక్టర్ గట్టెం వెంకటేష్ తన సూక్ష్మకళతో శ్రీరాముని ప్రతిరూపాన్ని అద్భుతంగా తీర్చి దిద్దాడు. మంగళవారం శ్రీరామనవమి సందర్భంగా 6బి పెన్సిల్ టిప్‌పై 6 గంటల సమయంలో 8 మిమీ వెడల్పు, 20 మి.మీ.ఎత్తులో శ్రీరాముని ప్రతిరూపాన్ని ఆవిష్కరించాడు. ఇదే గ్రామానికి చెందిన మరో సూక్ష్మ కళాకారుడు దార్ల రవి చెక్కపై శ్రీరామ్ బాణం చెక్కి తన కళను ప్రదర్శించాడు.

ఆసనాలు నేర్పిస్తున్న ట్రైనర్

యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం

ప్రజాశక్తి-నక్కపల్లి:యోగాసనాలతో అనేక దీర్ఘ కాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చునని, ప్రతీ ఒక్కరూ రోజూ కనీసం గంటన్నర యోగ, ప్రాణాయామం, ధ్యానం వంటి వాటికి కేటాయించాలని వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి యోగా ట్రైనర్ డి.రాంబాబు సూచించారు. నక్కపల్లికి సమీపంలో పలువురి కి యోగాసనాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం పలు ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలో పాఠశాలల పిల్లలకు యోగా శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు.

పతకాలు అందుకుంటున్న నాగజ్యోతి

పవర్ లిఫ్టింగ్‌లో నాగజ్యోతి ప్రతిభ

ప్రజాశక్తి-రోలుగుంట: విశాఖపట్నంలో జరిగిన ఇంటర్నేషనల్ పవర్ లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో సీనియర్స్, మాస్టర్స్ డెడ్ లిఫ్ట్ విభాగాల్లోనూ రోలుగుంట హైస్కూల్ ఉపాధ్యాయిని, అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి పివిఎం.నాగజ్యోతి అద్భుత ప్రతిభను కనబరిచారు. రెండు విభాగాల్లోనూ ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు సాధించారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కూడా దక్కించుకున్నారు. నాగజ్యోతికి పలువురు అభినందనలు తెలియజేశారు.

జాతీయ హ్యాండ్ బాల్ పోటీలకు రేవిడి విద్యార్థులు

ప్రజాశక్తి -పద్మనాభం : ముంబాయిలో ఈ నెల 21 నుంచి జరగనున్న జాతీయ మినీ హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, రేవిడిలో ఎనిమిదో తరగతి చదువుతున్న కర్రి దివ్యయాదవ్, టి.చరణ్, ఎస్.తనోజ్ కుమార్ ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సిహెచ్.రవికుమార్, అర్.శంకరరావు తెలిపారు. ఈ నెల 14న తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు వి.శంకరరావు మంగళవారం తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను మరగడ అప్పారావు, పాఠశాల సిబ్బంది కె.కృష్ణ, కె.శ్రీనివాసరావు, బి.రామునాయుడు, శ్రీనివాస్, సింహాచలం, వెంకటేష్ అభినందించారు.

వైవి.సుబ్బారెడ్డికి ఆత్మీయ అభినందన సభ

ప్రజాశక్తి -పద్మనాభం : రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వైవి.సుబ్బారెడ్డికి విశాఖపట్నం పోర్టు స్టేడియం పంక్షన్ హాల్‌లో ఆత్మీయ అభినందనసభ నిర్వహించారు. సుబ్బారెడ్డిని సినీ నిర్మాత సత్యనారాయణరాజు సన్మానించారు. సుబ్బారెడ్డి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని సత్యనారాయణరాజు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జలయజ్ఞం ఫౌండర్ రామరాజు, ఉత్తర నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు, మల్లాడి కృష్ణారావు, జి.శ్రీనివాస్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన ఉపాధి కూలీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని జోగంపేట పంచాయతీ చెందిన చిటికెల చిన్నమ్మలకు వడ దెబ్బతో ఉపాధి పనులు చేస్తుండగా స్పృహ తప్పి పడిపోయింది. దీంతో ఆమెకు తోటి కూలీలు సపర్యలు చేశారు. అనంతరం గొలు గొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

సపర్యలు చేస్తున్న కూలీలు

సర్టిఫికెట్ అందుకుంటున్న ప్రియాంక

రిఫరీగా ప్రియాంక

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక ఉషు కోచ్ వేపాడ ప్రియాంక రాష్ట్ర స్థాయి ఉషు రిఫరీ ఎగ్జామినేషన్‌లో సర్టిఫికెట్ సాధించింది. ఈ నెల 13 నుండి 15 వరకు సింహాచలం ఇండోర్ హాల్‌లో స్టేట్ రిఫరీ జడ్జి ఎగ్జామినేషన్ సెలక్షన్స్ నిర్వహించారు. అందులో మహిళల విభాగంలో ప్రియాంక పాల్గొని స్టేట్ జడ్జి గా అర్హత సాధించింది. ప్రియాంక ఉషు గేమ్స్‌లో అంచెలంచెలుగా ఎదిగి ఇంటర్నేషనల్ కోచ్ కావాలని ఆకాంక్షించారు. ఆమెను లలితా నర్సింగ్ హోం హస్పిటల్ డాక్టర్ ఎ.హనుతేజ్ (ఆర్థో స్పెషలిస్ట్), శావ్ కోచ్ అబ్బు అభినందించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ, నర్సీపట్నంలో ఎందరో క్రీడాకారులు ఉన్నారని, స్పాన్సర్షిప్ సరిగ్గా లేక రాణించ లేక పోతున్నారన్నారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

-ప్రిన్సిపాల్ సంధ్య

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం మండలం వేములపూడి ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-2025కు విద్యా సంవత్సరంకు సంబంధించి 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 21న నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, 21న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు తమ హాల్ టికెట్లతో హాజరు కావాలని సూచించారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

వేతనాలు చెల్లించాలని..

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నర్సీపట్నం ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ, ఏరియా ఆసుపత్రిలో పని చేస్తున్నా పారిశుద్ధ్య కార్మికులకు,సెక్యూరిటీ సిబ్బందికి నాలుగు నెలల నుండి వేతనాలను కాంట్రాక్టర్ చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ సమస్యపై ఆసుపత్రి సూపరిం డెంటెంట్‌కు గతంలో విన్నవించామన్నారు. అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. జీతాలు చెల్లించక పోవడంతో కార్మిక కుటుంబాలు పస్తులతో కాలం వెల్లదీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బకాయి వేతనాలు చెల్లించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవతి, వెంకటలక్ష్మి, చిన్న పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

రూ.300 కూలి పొందేలా చూడాలి

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్:ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వం నిర్దేశించిన రూ.300ల వేతన కూలీ పొందేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డుమ ఏపీడి మణికుమార్ తెలిపారు. రావికమతం మండలంలో ఓమ్మవరం గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఉపాధి కూలీలకు తగు సూచనలు, సలహాలు అందించారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన రూ.300 వేతన కూలి తగ్గకుండా అందరూ పని చేసుకోవాలని ఆయన సూచించారు. పనులతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు వలస వెళ్లడానికి అవకాశం లేకుండా వీటిని వినియోగించుకోవాలన్నారు.రైతులకు ఉపయోగపడే వ్యక్తిగత పనులతో పాటు గ్రామ అభివృద్ధికి పలు రకాల పనులను గుర్తించి ప్రాధాన్యత ప్రకారం చేసుకోవాలని సూచించారు.చెరువుల అభివృద్ధితో పాటు పంట పొలాలకు రోడ్లు, జీడి మామిడి తోటల్లో బౌండరీ ట్రెంచెస్, ఫారం పాండ్స్, పంట కాలువలు వంటి పలు రకాల పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇంకుడు గుంతల పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఈసీ కామేశ్వరరావు, టిఎ బైరాగి సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పని చేయాలి

కూటమి నేతల ప్రచారం

ప్రజాశక్తి-మాడుగుల:మాడుగుల మండలం ఎం.కోటపాడు గ్రామంలో మంగళవారం కూటమి నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పైలా ప్రసాదరావు, అనకాపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి సి.ఎం.రమేష్ సోదరుడు సురేష్ నాయుడు మాట్లాడుతూ, విజయమే లక్ష్యంగా కూటమి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు అడ్డెపల్లి జగ్గారావు, ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు, పేలూరి రాము, తాటికొండ త్రినాథ్, గుమ్మాల ఉదయ్ పాల్గొన్నారు.

చీడికాడ:మండలంలోని జి. కొత్తపల్లి గ్రామంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పైల ప్రసాదరావు సతీమణి శ్రీదేవి ఎన్నికల ప్రచారం చేపట్టారు. గంగాలమ్మబంధ, గెడసారం చెరువుల వద్ద ఉపాధి కూలీలకు సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. పైల ప్రసాదరావు 15 ఏళ్లుగా మాడుగుల నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆమె వెంట పైలా లక్ష్మి, సర్పంచ్ కొల్లి సూర్యనాయుడు, మాజీ ఎంపీపీ, జడ్పిటిసి పోతుల రమణమ్మ, మాజీ సర్పంచులు బండారు తాతబాబు, కొల్లి పైడం నాయుడు, పైల యువసేన అధ్యక్షుడు బలరాం పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న పైలా సతీమణి శ్రీదేవి, నేతలు

గాజువాక ప్రజల సమస్యలను విస్మరించిన చంద్రబాబు

- స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు కార్మికులపై మాట్లాడకపోవడం దుర్మార్గం

- సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 14న గాజువాకలో నిర్వహించిన ఎన్నికల సభలో గాజువాక ప్రజలు ఎదర్కొంటున్న సమస్యలు, ముఖ్యమైన స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను విస్మరించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న స్టీల్‌ప్లాంట్ కోసం కనీసం ప్రస్తావించలేదంటే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణపై వారికి ఎంత చిత్తశుద్ధి వుందో అర్థమౌతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించాల్సిన వర్కింగ్ క్యాపిటల్ కేటాయించలేదని, కేంద్ర బిజెపి ఉక్కు పరిశ్రమపై అబద్దాలు మాట్లాడుతూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ద్రోహం చేస్తున్న కేంద్ర బిజెపితో తెలుగుదేశం జతకట్టడమంటే స్టీల్‌ప్లాంట్‌ను చంపేయడమేనని పేర్కొన్నారు. 9 రోజుల నుండి గంగవరం పోర్టులో పనిచేస్తున్న కార్మికులు యావత్తు ముక్త కంఠంతో సమ్మె బాట పట్టారని, అదానీ కంపెనీ యాజమాన్యం గంగవరం పోర్టు కార్మికుల జీవితాలతో ఆట్లాడుతుందని తెలిపారు. గతంలో విశాఖ జిల్లా కలెక్టర్ సమక్షంలో అంగీకరించిన డిమాండ్లు కూడా పరిష్కారం చేయలేదన్నారు. గంగవరం పోర్టులో కార్మికులు 15 డిమాండ్లతో న్యాయమైన సమ్మె చేస్తుంటే కనీసం దానిని కూడా ప్రస్తావించలేదంటనే వీరు ఎవరి పక్షాన వున్నారో అర్థమౌతుందన్నారు. ఇటు స్టీల్‌ప్లాంట్ కార్మికుల పట్ల, గంగవరం పోర్టు కార్మికుల పట్ల తెలుగుదేశం పార్టీకి ఎలాంటి చిత్తశుద్ధి ఉందో తేటతెల్లమైందని పేర్కొన్నారు. యజమానులను రక్షించడానికే వీరున్నారు తప్ప కార్మికుల పక్షాన లేరని అర్థమౌతుందని, వారికి ప్రజలు, కార్మికులు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

దాడి మాటలు వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మాజీ మంత్రి దాడి వీరభద్రరావు సీనియర్ రాజకీయ నాయకునిగా, తన వయసు, సభ్యత మరచి మహిళ ఎంపీ అని కూడా చూడకుండా మాట్లాడడం సరికాదని, తన వ్యాఖ్యలు తక్షణమే వెనక్కు తీసుకోకుంటే తగిన పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని అనకాపల్లి పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బివి సత్యవతి హెచ్చరించారు. స్థానిక వివేకానంద హాల్లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డితోపాటు తనపై టిడిపి నాయకులు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు చేసిన వ్యాఖ్యలను డాక్టర్ సత్యవతి తీవ్రంగా ఖండించారు. మార్కెట్ యార్డ్ కన్వెన్షన్ హాల్ నిర్మాణం పేరుతో అక్కడ స్థలాలను కొట్టేయడానికి ఎంపీ ప్రయత్నమని వక్ర భాష్యంతో వీరభద్రరావు పలికిన పలుకులు సరి కాదని మరోసారి ఇలాంటి మాటలు మాట్లాడితే సరైన సమాధానం చెప్పడానికి వైసిపి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. నేను చేసిన ప్రతి పని కళ్ళముందే కనబడుతుంటే కళ్ళుండి చూడలేని అంధులా మీరు అని ప్రశ్నించారు. 500 పడకల మెడికల్ కళాశాల మరో చోటుకి తరలిపోవడానికి కారణం మీరు కాదా? అని ప్రశ్నించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో డైట్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-అనకాపల్లి : విజయనగరం జె.ఎన్.టి.యులో ఇటీవల జరిగిన ఇంటర్ కాలేజియేట్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం. కె.లలితేశ్వరరావు 93 కేజీల విభాగంలో 590 కేజీలు బరువును లిఫ్ట్ చేసి గోల్డ్ మెడల్, బీటెక్ రెండవ సంవత్సరం విద్యార్థి ఎ.వినయ్ కుమార్ 83 కేజీల విభాగంలో 400 కేజీల బరువును లిఫ్ట్ చేసి సిల్వర్ మెడల్, నాలుగో సంవత్సరం సివిల్ విద్యార్థి ఎం.సాయి యశ్వంత్ 59 కేజీల విభాగంలో 227 కేజీల బరువును లిఫ్ట్ చేసి సిల్వర్ మెడల్, సిఎస్సి రెండో సంవత్సరం విద్యార్థి బి.వినయ్ కుమార్ 66 కేజీల విభాగంలో 305 కేజీల బరువును లిఫ్ట్ చేసి బ్రాంజ్ మెడల్ సాధించినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బిసిహెచ్.శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, ఇతర అధికారులు అభినందనలు తెలిపారు.

సరుకులు సక్రమంగా సరఫరా చేయాలి

మాట్లాడుతున్న యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు

ప్రజాశక్తి- అనకాపల్లి : అంగన్వాడీ కేంద్రాలకు సరుకులు సక్రమంగా సరఫరా చేయాలని ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అనకాపల్లి జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యాలయంలో మంగళవారం యూనియన్ జిల్లా కమిటీ సమావేశం ఎం.దుర్గారాణి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా నాగ శేషు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, గర్భిణులు, బాలింతలకు ఇవ్వాల్సిన టేక్ హోమ్ రేషన్‌కు ఒకేసారి అన్ని సరుకులు సెంటర్లకు పంపిణీ చేయడం లేదని పేర్కొన్నారు. లబ్ధిదారులకు అన్ని సరుకులు ఒకేసారి ఇస్తేనే ఎఫ్ఆర్ఎస్ యాప్ తీసుకుంటుందని, అయితే సరుకులు ఇవ్వకుండానే సరుకులు ఇచ్చినట్టు యాప్‌లో నమోదు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు వండడానికి కూడా బియ్యం లేని సెంటర్లు ఉన్నాయని, కావున తక్షణమే నెలకు సరిపడా స్టాకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎండల తీవ్రత దష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలను ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచాలని ఉత్తర్వులు ఇచ్చినా జిల్లా అధికారులు, సిడిపిఓలు దానిని అమలు చేయడం లేదని, అంగన్వాడీ ఆయా, టీచర్లను సాయంత్రం నాలుగు గంటల వరకు సెంటర్లోనే ఉండాలని, లేకపోతే మెమో ఇచ్చి ఉద్యోగాల నుండి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి వివి రమణమ్మ, కె.రామలక్ష్మి, తనుజ, ఉమా నారాయణమ్మ, జయ, మంగా, పాల్గొన్నారు.

21న మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ఉన్న 5 ఏపి మోడల్ స్కూళ్లలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఈనెల 21న నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి ఎం వెంకట లక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరిగే పరీక్షకు విద్యార్థులు ఒక గంట ముందు హాజరు కావాలన్నారు. వారి హాల్ టికెట్లను www.cse.ap.gov.in/apms.ap.gov.in వెబ్సైట్లో డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఓఎంఆర్ షీట్స్ ద్వారా ఉంటుందన్నారు. సమాధానాలు నలుపు లేదా నీలం రంగు బాల్ పాయింట్ పెన్‌తో రాయాలన్నారు. హాల్ టికెట్‌పై ఫోటో లేకపోతే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుని చేత రెండు ఫోటోలపై అటెస్టేషన్ చేయించి తీసుకురావాలని, సమాచారం కోసం సమీప పాఠశాల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలన్నారు.

తాటిచెట్లపాలెంలో 'జైభారత్' ప్రచారం

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలోని తాటిచెట్లపాలెంలో జై భారత్ నేషనల్ పార్టీ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ మంగళవారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత రాజకీయాల్లో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గంలోని సమస్యలన్నింటినీ పరిష్కరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. టార్చిలైట్ గుర్తుపై ఓటు వేసి జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తాటిచెట్లపాలేనికి చెందిన జై భారత్ నేషనల్ పార్టీ కార్యకర్త శ్రీనివాస్ తండ్రి అకాల మరణంతో లక్ష్మీనారాయణ నివాళులర్పించారు.

నాయీ బ్రాహ్మణులతో వైసిపి ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -గోపాలపట్నం : స్థానిక కుమారి కళ్యాణ మండపంలో విశాఖపట్నం నాయీ బ్రాహ్మణుల అసోసియేషన్ ఆధ్వర్యాన జివిఎంసి 52, 56, 57, 89, 90, 91, 92 వార్డులకు సంబంధించిన నాయీ బ్రాహ్మణుల నాయకులతో వైసిపి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి కో-ఆప్షన్ సభ్యులు బెహరా భాస్కరరావు, నాయకులు గునిశెట్టి శ్రీనివాసరావు, గొర్లె అప్పలస్వామి నాయుడు, అయితంశెట్టి గోపి, నూకరాజు, నాయీ బ్రాహ్మణ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ పెంటారావు, వైస్ ప్రెసిడెంట్ అప్పలరాజు, విశాఖపట్నం ప్రెసిడెంట్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఆడారి ఆనంద్‌కుమార్

జోరుగా ముత్తంశెట్టి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధిలో ఉన్న పలు ప్రాంతాల్లో మంగళవారం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను తెలుపుతూ ముద్రించిన బ్రోచర్లను ఇంటింటికీ అందజేశారు. మే 13 న జరుగు ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి స్థానిక ఎమ్మెల్యేగా తనను, విశాఖ లోక్‌సభ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.కృష్ణ, జి.మధునాయుడు, కొప్పల రమేష్, అక్కరమాని రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం మండలంలో..

పద్మనాభం : పద్మనాభం మండలంలోని కృష్ణాపురం, పద్మనాభం, మద్ది గ్రామాల్లో వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రలోభాలకు లోనుకాకుండా ఓటర్లు ఓటు వేయాలని కోరారు. ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు.. అని కల్లబొల్లి కబుర్లు చెబుతుంటారని, ఆ మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. వైసిపిని గెలిపించాలని కోరారు.

పద్మనాభం మండలం కృష్ణాపురంలో ప్రచారంలో పాల్గొన్న బొత్స ఝాన్సీ, ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తర్లువాడలో...

ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ గ్రామంలో సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, వైసిపి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు ఆధ్వర్యాన వైసిపికి మద్దతుగా గడపగడపకూ ప్రచారం నిర్వహించారు. జగన్మోహన్‌రెడ్డి అమలుచేసిన సంక్షేమ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీచేస్తూ ప్రచారం సాగించారు. ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బంక సత్యం, మజ్జి రమేష్ నాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వార్డుల్లో కెకె.రాజు ప్రచారం

51వ వార్డులో ప్రచారం చేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 51వ వార్డు పరిధి చిట్టిబాబుకాలనీ, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఆధ్వర్యాన వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పైడి శ్రీను, అమర్‌రెడ్డి, తిరుమలరావు, డి.రమేష్, రాణి, రత్నం, ధర్మవతి, అంబటి శైలేష్, రాజేశ్వరరావు, వినోద్, రాజారాజు తదితరులు పాల్గొన్నారు.

కస్తూరినగర్‌లో...

జివిఎంసి 46వ వార్డు పరిధి కస్తూరినగర్ ప్రాంతంలో డిప్యూటీ మేయర్ కటుమూర్తి సతీష్ ఆధ్వర్యాన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజును, ఎంపీగా బొత్స ఝాన్సీని బలపరచాలని కోరారు.

వైసిపిలో చేరిక

సీతమ్మధార : 47వ వార్డు పరిధి న్యూ బాపూజీనగర్ గాయత్రీ ఫంక్షన్ హాల్లో స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి, బూత్ కన్వీనర్ బంగారి సురేష్ సమక్షంలో జనసేన నుంచి పండు బాబు, భీమా తదితర 50 మంది యువకులు, మహిళలు వైసిపిలో చేరారు. వీరికి ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, వసంతల అప్పారావు, సుకుమార్, కె.విజయ్, రాఘవ, నరసింగ్, సాయి, బుల్లి బాబు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యాన 42వ వార్డుకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు అబ్దుల్ షఫీ వైసిపిలో చేరారు. ఉత్తరాంధ్ర రీజనల్ వైసిపి కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి రుషికొండలోని ఆయన ఇంటి వద్ద కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఆత్మీయ సమావేశం

ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఆటోమొబైల్స్ కార్మికులతో సతీష్‌రాజు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కెకె.రాజు హాజరై మాట్లాడారు. వైసిపి విజయానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజని, కె.అనీల్‌కుమార్‌రాజు, బర్కత్ ఆలీ, నాయకులు చల్లా ఈశ్వరరావు, గుజ్జు వెంకటరెడ్డి, బాకీ శ్యాం కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.